క్లుప్తంగా

సీసీ రోడ్డుకు మరమ్మతులు



పూర్తయిన సీసీ రోడ్డును పరిశీలిస్తున్న వెంకటరావు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్యను ఎంపీపీ డాక్టర్ మజ్జి ప్రియాంక శారద పరిష్కరించారు. గురువారం పంచాయతీలో రూ.11 లక్షల విలువైన నిధులతో సీసీ రోడ్డు మరమ్మతులు ప్రారంభించి సాయంత్రానికి పూర్తి చేశారు. బంగారమ్మతల్లి ఆలయం నుంచి బాలి సత్యవతి ఇంటి వరకు సుమారు 500 మీటర్ల మేర రహదారితో పాటు మిగిలిన చోట్ల మరమ్మతులు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, కోరాడ ఆదినారాయణ తదితరులు పనులు పరిశీలించారు.

శిల్పారామంలో ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న స్థానిక యువతులు

పీఎం పాలెం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా శిల్పారామంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలు, యువతులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని, రంగవల్లికలు తీర్చిదిద్దారు. పోటీలను స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు. విజేతలకు సంక్రాంతి రోజు సాయంత్రం బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు విక్రాంత్ కౌల్



క్రికెట్ పోటీలలో బంగారుపతకం సాధించిన కేథరిన్ విద్యార్థులు

తగరపువలస: గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 6,7,8 తేదీలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో భీమిలి కేథరిన్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. విశాఖ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన కేథరిన్ జూనియర్ కళాశాల విద్యార్థి కె.విక్రాంత్ కౌల్ జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విక్రాంత్ కౌల్‌ను, కేథరిన్ పబ్లిక్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి సంపంగి చరణ్‌తేజను విద్యాసంస్థల కరస్పాండెంట్ ఆలీవర్ ఆర్ రాయి, డైరెక్టర్ డాక్టర్ ఇవాంజలిన్ సుష్మారాయి, ప్రిన్సిపాల్ సౌజన్యసాయి అభినందించారు.

భారీ వృక్షం నరికివేత

కొమ్మాది: ఏళ్ల తరబడి ఎందరికో నీడనిచ్చిన ఓ భారీ చెట్టును ఓ వ్యక్తి నరికివేశాడు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దుర్గానగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఓ వ్యక్తి భారీ బిల్డింగ్ నిర్మాణం చేపట్టాడు. తన నిర్మాణానికి అడ్డు వస్తున్న నెపంతో ఎటువంటి అనుమతులు లేకుండా ఆ భారీ వృక్షాన్ని బుధవారం అర్ధరాత్రి నరికివేశాడు. గురువారం ఉదయం చూసేసరికి వృక్షం కాస్త మోడుగా మిగలడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుంటే నిర్మాణాల పేరుతో పచ్చదనం కనుమరుగవుతుందన్నారు.

భగీరథ పైపులైన్‌కు లీకులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ వెంకటేశ్వరమెట్ట వద్ద భగీరథ రిజర్వాయర్‌కు గోస్తని నదిలోని ఊటబావుల ద్వారా సేకరించిన నీటిని తరలించే పైపులైన్‌కు లీకులు ఏర్పడ్డాయి. దీంతో కొండవాలు ప్రాంతంలో తాగునీరు వృథాగా పోతోంది. దీనికి మరమ్మతులు చేపట్టాలని వెంకటేశ్వరమెట్ట వాసులు కోరుతున్నారు.



గెలుచుకున్న ట్రోఫీలు, కప్‌లు

హ్యాట్రిక్ చాంపియన్స్

మహిళా పాలిటెక్నిక్ విద్యార్థుల అద్భుత ప్రతిభ ● మూడుసార్లు వరుసగా ఓవరాల్ చాంపియన్‌షిప్

ఆ కళాశాల విద్యార్థినులు పోటీల్లో పాల్గొంటే పతకం గ్యారంటీ. ఖోఖో, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, డిస్క్‌త్రో, షాట్‌పుట్.. ఇలా వివిధ క్రీడా విభాగాల్లో రాణిస్తున్నారు. జిల్లా స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల్లో 2022, 2023, 2024 సంవత్సరాలకు గాను వరుసగా మూడుసార్లు ఓవరాల్ **చాంపియన్‌షిప్‌ను గెలుచుకుని హ్యాట్రిక్ సాధించారు. ఆల్‌రౌండర్ ట్రోఫీని కైవసం చేసుకుని భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఖ్యాతిని ఇనుమడింపజేశారు.**

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు క్రీడల్లో అద్భుతంగా రాణిస్తున్నారు. కళాశాలలో 600 మంది విద్యార్థినులు ఉన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ చదువుతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా క్రీడల్లోనూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్ షబ్నం పర్వీన్ పర్యవేక్షణలో ఉదయం, సాయంత్రం శిక్షణ పొందుతున్నారు. విద్యార్థినులు కూడా ఎంతో పట్టుదలతో శ్రమించడంతో జిల్లా స్థాయి పోటీల్లో 2022, 2023, 2024 సంవత్సరాలకు వరుసగా మూడుసార్లు **ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకుని హ్యాట్రిక్‌ను సాధించి, తమకు తిరుగులేదని నిరూపించుకున్నారు.**

ఈ పోటీల్లో ప్రతీ సంవత్సరం విశాఖ జిల్లా నుంచి 7 ప్రభుత్వ కళాశాలలు, 13 ప్రైవేటు కళాశాలలు మొత్తం 20 కళాశాలలు పాల్గొంటున్నాయి. ప్రత్యేక శిక్షణతో ఈ విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను సొంతం చేసుకుంటున్నారు. మూడు సార్లు వరుసగా గెలవడంతో ఆల్‌రౌండర్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. దీంతో రాష్ట్రస్థాయిలో వీరికి మంచి గుర్తింపు లభించి, అందరి ప్రశంసలను పొందుతున్నారు.

శిక్షణ ఇలా..

ఇక్కడ కళాశాల విద్యార్థినులకు క్రీడల్లో 300 మంది వరకు ఉంటే బాగా ఆసక్తి, పట్టుదల హాస్టల్లో ఉండి చదుకుంటున్న శిక్షణ అందిస్తున్నారు. హాస్టల్లో ఉన్నారు వీరిలో క్రీడల్లో ఉన్న 40 మందిని ఫిజికల్ డైరెక్టర్ షబ్నం పర్వీన్ ఎంపిక చేస్తారు. ఇక్కడ వీరికి వాలీబాల్, షటిల్, ఖోఖో,రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, డిస్క్‌త్రో, షాట్‌పుట్ మొదలైన విభాగాల్లో ఎవరికి దేనిపై ఆసక్తి ఉందో వారికి ఆ విభాగానికి ఎంపిక చేసి శిక్షణ అందిస్తున్నారు. ముఖ్యంగా వీరు ప్రతిరోజు సాయంత్రం ఇక్కడ మైదానంలో ఆటలు ఆడుతారు. జిల్లా స్థాయి పోటీలకు రెండు నెలల ముందు నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ, సాధన ఉంటుంది. దీనికి ప్రతిరోజు తప్పని సరిగా పీడీ పర్వీన్ హాజరై స్వయంగా పర్యవేక్షించి, శిక్షణ ఇస్తున్నారు.

“చాలా బాగా ప్రోత్సహిస్తున్నారు”



నేను డిప్లమో ఇన్ సివిల్ మూడో సంవత్సరం చదువుతున్నా. ఇక్కడ అందరం క్రీడల్లో రాణించడంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, పీడీ ప్రోత్సాహం ఎంతో ఉంది. వారు మేము ఏ క్రీడలో బాగా ఆడుతున్నామో గుర్తించి, వాటిల్లో తగిన పట్టు సాధించే విధంగా శిక్షణ ఇస్తున్నారు. మాకు సౌకర్యాలు కల్పిస్తూ ఎంతో ప్రోత్సహిస్తున్నారు.

–జాహ్నవి శుభవర్షిణి, వాలీబాల్ క్రీడాకారిణి

“వారి ఉజ్వల భవిత కోసమే..”



మా కళాశాల విద్యార్థినులు అన్నింట్లో ముందు ఉండాలన్నది నా ఆశయం. ఇక్కడి విద్యార్థినులకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. క్రీడల్లో రాణిస్తే వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మంచి ఉద్యోగ అవకాశాలు రావడమే కాకుండా నిరంతరం దీన్ని కొనసాగిస్తే ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. అందుకే ప్రత్యేక శ్రద్ధతో ప్రోత్సహిస్తున్నాం.

–డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ, ప్రిన్సిపాల్

“టీమ్ వర్క్ వల్లే విజయం”



నాకు ముందు నుంచి ఖోఖో అంటే చాలా ఇష్టం. పాలిటెక్నిక్ కాలేజీలో కంప్యూటర్స్‌లో డిప్లమో చేస్తున్నా. ఫైనలియర్. వరుసగా మూడోసారి క్రీడాపోటీల్లో పాల్గొన్నా. మేమంతా కలసికట్టుగా ఉంటాం. గైడెన్స్, టీమ్ వర్క్ వల్లనే అన్ని పోటీల్లో విజయం సాధించగలుగుతున్నాం.

– జి.యామిని దేవి, ఖోఖో క్రీడాకారిణి

“అందరి సహకారంతో సాధ్యం”



విద్యార్థినులు వరుస విజయాలు సాధిస్తుండడానికి ప్రధాన కారణం ప్రతి ఒక్కరి సహకారం సంపూర్ణంగా ఉండటమే. ఇక్కడ ఆయా క్రీడల్లో అందిస్తున్న శిక్షణకు అనుగుణంగా ఎంతో శ్రద్ధగా నేర్చుకుంటున్నారు. క్రమం తప్పకుండా సాధన చేస్తున్నారు. వారి విజయ రహస్యం ఇదే.

– షబ్నం పర్వీన్, ఫిజికల్ డైరెక్టర్

“నిరంతర ప్రాక్టీస్”



నేను ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఫైనలియర్ చదువుతున్నా. నాకు షాట్‌పుట్, రన్నింగ్ అంటే ఎంతో ఆసక్తి. కాలేజీలో చేరినప్పుడు మాకు ఏ క్రీడలో ఆసక్తి గమనించి, దానికి అనుగుణంగా శిక్షణ ఇస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా ప్రాక్టీస్ చేస్తాం. ఏమాత్రం పట్టు సడలకుండా పోటీకి సన్నద్ధం అయ్యాం. గెలిచిన ఉత్సాహంతో మరింత కృషి చేయగలుగుతున్నాం. – జి.భార్గవి, అథ్లెట్







2022, 2023, 2024 ఓవరాల్ చాంపియన్ ట్రోఫీలతో విద్యార్థినులు

తేజకు వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి



పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాసురాజు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను

తగరపువలస: భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు తనయుడు తేజేశ్వరరావు మూడో వర్ధంతి సందర్భంగా గురువారం పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమిలి మండలం లక్ష్మీపురంలో జరిగిన సేవా కార్యక్రమాలలో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాట్ల పెదబాబు, ఎంపీపీ దంతులూరి వాసురాజు చేతుల మీదుగా 300 మంది పేదలకు దుప్పట్లు, బట్టలు పంపిణీ చేసి, భారీగా అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, జిల్లా క్వారీలారీ యజమానుల సంఘం అధ్యక్షుడు మద్దిల వెంకటరమణ, కొళ్ల అప్పల సూర్యనారాయణ, ఈప్పు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లచ్చుబుగత జగదీశ్వరరావు, గాడు వెంకటనారాయణ, చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, కేపీ సత్యనారాయణ, మేరుగు ఎల్లాజీ, కరుభుక్త అప్పలనారాయణ, తుపాకుల అప్పలస్వామి, పూసర్ల ఎర్రయ్య, భాగం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర సంచులే వినియోగిద్దాం



ప్లాస్టిక్ వాడొద్దంటూ ప్రచారం చేస్తున్న అధికారులు

కొమ్మాది: ప్లాస్టిక్ సంచులను మాని వస్త్ర సంచులను మాత్రమే వాడి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఏఎంవోహెచ్ కిషోర్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండలో ప్లాస్టిక్ సంచులు వాడొద్దంటూ ప్రచారం చేస్తూ, దుకాణాల యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లి, ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. మూగ జీవులు ఈ ప్లాస్టిక్ కవర్లు తిని మృత్యువాత పడుతున్నాయన్నారు. వ్యాపారులు, ప్రజలు, ప్లాస్టిక్ నిషేధానికి మద్దతు ప్రకటించి వస్త్ర సంచులు వాడాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అష్టలక్ష్మీ వైభవం

దీపకాంతుల శోభతో అష్టలక్ష్మీ అమ్మవార్లు దేదీప్యమానంగా దర్శనమిచ్చారు. స్థానిక అన్నంరాజు నగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మీ దేవాలయం మండపంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ గోదా అమ్మవారికి, అష్టలక్ష్మీ అమ్మవార్లకు ఏక కాలంలో దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అష్టలక్ష్ముల చుట్టూ 1001 దీపాలను అలంకరించి, ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి విశేష పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు. – కొమ్మాది



‘ముక్కోటి’కి మాధవుని ఆలయం ముస్తాబు



పూల మాలలతో అలంకరించిన కుంతీ మాధవ స్వామి ఆలయ లోపలి భాగం



వెంకటేశ్వరమెట్టపై శ్రీవారి ఆలయంలో అలంకరణ పనులు

పద్మనాభం: ముక్కోటి ఏకాదశికి కుంతీ మాధవ స్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయాన్ని పూల తోరణాలతో అలంకరించారు. ఉత్తర ద్వారం ముందు భాగంలో కొబ్బరాకుల పందిరి వేశారు. గతంలో శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో గ్రామంలో ఊరేగించేవారు. ఈ సారి హంస వాహనంపై ఊరేగిస్తారు. పుష్ప యాగానికి పుష్పాలను సిద్ధం చేశారు.

ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు

తగరపువలస: ఒకటోవార్డు వెంకటేశ్వరమెట్టపై శ్రీవారి ఆలయం, రెండోవార్డు సత్యనారాయణ కొండపై శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయాలలో ముక్కోటి ఏకాదశి పూజలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వేకువజాము నుంచే భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనాలు కల్పించేందుకు ఆలయ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వ నమ్మక ద్రోహంపై నిరసన



మధురవాడ మార్కెట్ వద్ద హైవేపై నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

మధురవాడ: విశాఖ ఉక్కుకర్మాగారం ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని మోదీతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ స్పష్టమైన ప్రకటన చేయించలేకపోయారని సీపీఎం జిల్లా నాయకుడు డి.అప్పలరాజు విమర్శించారు. కూటమి ప్రభుత్వ నమ్మక ద్రోహంపై వామపక్ష నాయకులు మధురవాడ మార్కెట్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ప్లకార్డులు చేతపట్టి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. సీఐటీయూ జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్‌కుమార్, నాయకులు గురుమూర్తి రెడ్డి, డి. రవి, ఎస్.రాములప్పడు, గోవింద, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో తాగునీటి వసతికి దివీస్ సహకారం

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌కు దివీస్ యాజమాన్యం రూ.1.89 లక్షల సీఎస్ఆర్ నిధులతో తాగునీటి వసతి కల్పించింది. హెచ్ఎం రోజామణి దివీస్ యాజమాన్యాన్ని సంప్రదించడంతో నూతన బోరుబావి,మోటా రు ఏర్పాటు చేసి ఎంఈవో శివరాణి చేతుల మీదుగా స్కూల్ యాజమాన్యానికి అప్పగించారు.దివీస్ ప్రతినిధులు సురేష్ ,శ్రీనివాస్, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి

భగభగ మండే భోగి మంటలు.. హరివిల్లే ఇల చేరినట్లున్న రంగవల్లికలు .. ముచ్చట గొలిపే గొబ్బెమ్మలు.. హరిదాసుల సంకీర్తనలు .. ఆకట్టుకునే బొమ్మల కొలువు.. చిన్నారుల భోగిపళ్ల వేడుకలతో తెలుగు వారి సంక్రాంతి పండుగ ముందే వచ్చిందా అన్నట్లుగా దర్శనమిచ్చింది. విద్యాలయాల్లో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో కనువిందు చేశారు.

– తగరపువలస/భీమిలి/పద్మనాభం



గొబ్బెమ్మల వద్ద తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు



డైట్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు



రెడ్డిపల్లి హైస్కూల్లో భోగి మంట వేస్తున్న విద్యార్థులు





రౌతులపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంక్రాంతి సంబరాలు



సోది చెబుతానంటూ విద్యార్థిని సందడి



గోదా రంగనాథులుగా..



గంభీరం ప్రాథమిక పాఠశాలలో గొబ్బెమ్మల వద్ద సంక్రాంతి వేషధారణల్లో విద్యార్థులు



చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భోగిమంట వద్ద విద్యార్థులు, అధ్యాపకులు